నేడు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.భారతి, బి.మాణిక్యం తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని, సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జ్యూట్‌మిల్లు సెంటర్ నుండి భారీ ప్రదర్శన కలెక్టరేట్ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎంఎల్ఎ గారూ.. ఇది 'ధర్మ'మా..!

- ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరు రైతుల్లో తీవ్ర ఆందోళన
- అన్‌సర్వే భూముల్లో రబీ సాగుపై పొలిటికల్ డ్రామా
- ప్రజాప్రతినిధుల మాటలకు.. క్షేత్రస్థాయి పరిస్థితికి పొంతన కరువు
- రైతులను అడ్డుకుంటున్న అటవీ అధికారులు.. దిక్కుతోచని అన్నదాత
- నారుమడులకు సమయం ఆసన్నమైనా ఏఒక్కరికీ పట్టని దుస్థితి అటవీ శాఖ మంత్రిగా జనసేన అధినేత
- పవన్‌కల్యాణ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నాదెండ్ల మనోహర్
- జనసేన ఎంఎల్ఎ ఉన్నచోట రైతుల పరిస్థితి అగమ్యగోచరం

సాగు చేసుకునేందుకు వెళ్లకుండా తోకలపల్లిలో రైతులను అడ్డగింత(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరుప్రతినిధి

ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొల్లేరును ఆనుకుని ఉన్న అన్‌సర్వే భూముల్లో రబీ సాగుపై పొలిటికల్ డ్రామా కొనసాగుతోంది. రబీసాగుపై ప్రజాప్రతినిధులు చెబుతున్న మాటలకు.. అక్కడ జరుగుతున్న తీరుకు ఏమాత్రం పొంతన లేకుండాపోయింది. దీంతో ఎంఎల్ఎగారూ.. ఇది ధర్మమా అంటూ అక్కడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లేరులోని అన్‌సర్వే భూముల్లో వరిసాగుపై వందల ఏళ్లుగా లేని సమస్యను ఇప్పుడే ఎందుకు తెరపైకి తీసుకొచ్చారనే ప్రశ్న అక్కడి రైతులను వేధిస్తోంది. తమకు తెలియని ఏదో పొలిటికల్ డ్రామా సాగుతుందనే చర్చ సర్వత్రా నడుస్తోంది. నారుమడులకు సమయం దగ్గర పడటంతో రబీ సాగుపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఉంగుటూరు, దెందులూరు, కైకలూరు, ఉండి నియోజకవర్గాల పరిధిలో కొల్లేరు ప్రాంతం విస్తరించి ఉంది. దాదాపు 77 వేల ఎకరాల్లో ఈ కొల్లేరు ఉంది. కొల్లేరులో అక్రమ చేపల చెరువుల తవ్వకాలపై దాదాపు 25 ఏళ్లుగా సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో చెరువులను ధ్వంసం చేశారు. అప్పుడు సైతం వరిసాగు చేసుకునే రైతులను ఎటువంటి ఇబ్బందీ పెట్టలేదు. నిడమర్రు మండలంలోని అడవికొలను, పెదనింద్రకొలను, తోకలపల్లి, భైనేపల్లి, చానమల్లి, ఆముదాలపల్లితోపాటు ఉంగుటూరు మండలంలోని అప్పారావుపేట వంటి అనేక గ్రామాల్లో రైతులు వందల ఏళ్లుగా రబీలో వరిసాగు చేస్తున్నారు. డిసెంబర్‌లో నారుమడులు వేసుకుని ఏప్రిల్ నాటికి అక్కడి నుంచి పంట తీసుకొచ్చేస్తారు. కొల్లేరును ఆనుకుని ఉన్న అన్‌సర్వే భూముల్లో వరిసాగుకు ప్రభుత్వాలే అనుమతులిచ్చాయి. ఆ పొలాలకు పన్నులు సైతం చెల్లించారు.

వేల ఎకరాల సాగుపై ఎందుకీ దొంగాట

ఉంగుటూరు నియోజకవర్గంలో కొల్లేరు అన్‌సర్వే భూములు దాదాపు మూడు వేల ఎకరాల వరకూ ఉన్నట్లు చెబుతున్నారు. ఈ భూముల్లో రైతులు వరిసాగు మాత్రమే చేస్తున్నారు. 25 ఏళ్లుగా సుప్రీంకోర్టులో కొల్లేరు అంశం నడుస్తోంది. ఇప్పుడు సుప్రీంకోర్టులో ఉందంటూ వరిసాగును అడ్డుకుంటున్న పరిస్థితి. కొల్లేరు అన్‌సర్వే భూములన్నీ పేదరైతులే సాగు చేసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నా ప్రజాప్రతినిధులుగాని, జిల్లా అధికారులుగాని పట్టించుకోని పరిస్థితి. గత నవంబర్ 13న వేలాది మంది ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన కొల్లేరు రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. స్థానిక ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు వచ్చి రైతులను తీసుకుని ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అయినప్పటికీ ఏమాత్రం ప్రయోజనం లేకుండాపోయింది. నవంబర్ 26న తోకలపల్లిలో రైతులు సాగు చేసుకునేందుకు పొలాల్లోకి వెళ్తుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం తీవ్ర అలజడి రేపింది.

ఎంఎల్ఎ ధర్మరాజు పట్టించుకోవడం లేదని ఆవేదన

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు కొల్లేరు రైతుల వ్యథను ఏమాత్రం పట్టించుకోవడం లేదని జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. అటవీశాఖ మంత్రిగా జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఉన్నారు. కొల్లేరు అంశం ఆయన పరిధిలోకే వస్తుంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా జనసేన కీలకనేత నాదెండ్ల మనోహర్ ఉన్నారు. ఉంగుటూరు ఎంఎల్ఎగా జనసేనకు చెందిన పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. అయినప్పటికీ కొల్లేరులో వరిసాగు చేసుకునే విషయంలో న్యాయం జరగని పరిస్థితి. డిసెంబర్ ఒకటో తేదీన ఉంగుటూరు నియోజకవర్గంలో సిఎం పర్యటించారు. ఆ సందర్భంగా ఎంఎల్ఎ కొల్లేరులో రబీసాగు అంశాన్ని లేవనెత్తకపోవడం చర్చకు దారితీసింది. నవంబర్ 26న డిఆర్‌సి సమావేశంలోనూ ఈ అంశం ప్రస్తావన లేకపోవడం అందరినీ విస్మయపర్చింది. సిఎంకు తమ గోడు చెప్పుకుందామనుకున్న తోకలపల్లి, భైనేపల్లి, ఆముదాలపల్లి రైతులను సభకు రాకుండా అడ్డుకున్నారు. నారుమడులు వేసే సమయం ఆసన్నమైంది. ఇప్పటికైనా కొల్లేరు అన్‌సర్వే భూముల్లో రబీ సాగుకు అనుమతివ్వాలని రైతులు కోరుతున్నారు. ఎంపీ పుట్టా మహేష్, ఎంఎల్ఎ ధర్మరాజు కొల్లేరు రైతుల దాళ్వాసాగు సమస్యను వెంటనే పరిష్కరించాలని అంతా కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ సైతం సమస్యను పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.

పల్స్‌పోలియోకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల 21 నుండి 23వ తేదీ వరకు జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఐదు సంవత్సరాల్లోపు 2.04 లక్షల మంది చిన్నారులు ఉన్నారని, వీరిలో గ్రామీణ ప్రాంతంలో లక్షా 49 వేల 470 మంది, పట్టణ ప్రాంతాల్లో 29,827 మంది, గిరిజన ప్రాంతాల్లో 20,707 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. వారికి అవసరమైన వ్యాక్సిన్ డోసులు సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 21న ప్రతి చిన్నారికీ 1707 వ్యాక్సినేషన్ కేంద్రాలు, 72 మొబైల్ కేంద్రాల ద్వారా పల్స్‌పోలియో వ్యాక్సిన్ అందించేలా పటిష్టమైన ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్‌టిసి బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి పోలియో వ్యాక్సిన్ వేయాలన్నారు. అనంతరం 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో వ్యాక్సిన్ తీసుకుని చిన్నారులను గుర్తించి, వారికి వారి ఇంటి వద్దే వ్యాక్సిన్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలియో వ్యాక్సిన్ ప్రతి చిన్నారికీ వేసేలా వ్యాక్సిన్ వేసే తేదీ, సమయం, కేంద్రం వివరాలు గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ నెల 21న పల్స్‌పోలియో కార్యక్రమంపై ప్రతి ప్రభుత్వాసుపత్రి పరిధిలో, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, మహిళా మండలి సభ్యులు, స్థానిక ప్రముఖులను భాగస్వాములు చేయాలన్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియపై సిబ్బందికి ముందస్తుగా శిక్షణ అందించాలన్నారు. వ్యాక్సిన్ నిల్వ చేసే కేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా పల్స్‌పోలియోపై ముద్రించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ భీమేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ట్రాన్స్‌కో ఎస్ఇ సాల్మన్‌రాజు, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పీడీ శారద, ఆర్‌టిసి ఆర్‌ఎం షబ్నం, డెమో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇవిఎం గొడౌన్ తనిఖీ

స్థానిక జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇవిఎంల గొడౌన్‌ను గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. గొడౌన్ వద్ద సీసీ కెమెరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఇవిఎం యంత్రాల బియులు, సియులు, వివిప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టర్‌లో ఆమె సంతకం చేశారు. ఇవిఎండౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ కెసిహెచ్.చల్లన్నదొర, టిడిపి ప్రతినిధులు కె.అచ్యుత్‌బాబు, యు.ఆనందం, వైసిపి ప్రతినిధి వి.స్టాన్లీబాబు, బిఎస్‌పి ప్రతినిధి రాతన్‌కాంత్, జనసేన ప్రతినిధి టి.రాంచందు, బిజెపి ప్రతినిధి నెరుసు నెలరాజు తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం'ను పోలవరం జిల్లాలో కలపాలి

సిపిఎం, పోలవరం సాధన కమిటీ



ప్లకార్డులు చేతబూని నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలను కలిపి జిల్లా చేయాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆ కమిటీ సమావేశం పోలోజు నాగేశ్వరరావు అధ్య క్షతన గురువారం జరిగింది. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం.నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రంపచోడవరం కేంద్రంగా పోలవంర జిల్లా ప్రకటించిందని, అయితే అందులో పోలవరం నియోజకవర్గంలోని షెడ్యూల్డ్ మండలాలు లేకపోవడం సరికాదన్నారు. పోలవరం నియోజకవర్గంలోని షెడ్యూల్డ్, నాన్‌షెడ్యూల్ గిరిజన గ్రామాలను కలిపి పోలవరం జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు పోలవరం, రంపచోవడం నియోజకవర్గాలు కలిపి ప్రత్యేక జిల్లా చేస్తామని చెప్పి, పోలవరం నియోజకవర్గం లేకుండా పోలవరం పేరుతో జిల్లా ఏర్పాటు అన్యాయమన్నారు. సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికే దశలవారీ కార్యక్రమాలు జరుగుతున్నాయని, అవసరమైతే మన్యం బంద్‌కు కూడా వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం బుట్టాయిగూడెం తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తామా ముత్యాలమ్మ, వి.వీరయ్య, ఉడతా వెంకటేశ్వరరావు, కారం ముత్యాలరావు, కురసం భీమరాజు, చంద్రు బుల్లమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, పూనం శేఖర్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: రంపచోడవరం కేంద్రంగా పోలవరం పేరుతో ఏర్పడే జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని జిల్లా సాధన కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య డిమాండ్ చేశారు. గురువారం కొరుటూరు పునరావాస కాలనీలోని సచివాలయ పరిధిలో జెఎసి ఆధ్వర్యంలో నిరసన చేపట్టినట్లు తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కొరుటూరు సర్పంచి రామ్‌గోపాల్‌రెడ్డి, నాయకులు కారం నాగదుర్గ, కె.జగదీష్, సీతారాంరెడ్డి, పోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హేలాపురి బాలోత్సవం

ఏర్పాట్లు పూర్తి

14న బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో ఈ నెల 12, 13 తేదీల్లో హేలాపురి ఆరో బాలోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని హేలాపురి బాలోత్సవం ఛైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. బాలల్లో విశాల మనస్తత్వం, ఐక్యతా భావాన్ని పెంచడానికి, సృజనాత్మకతను అభివృద్ధి చేయడానికి, శాస్త్ర సాంకేతిక పరిశోధనల పట్ల ఆసక్తిని పెంచడానికి ఆరేళ్లుగా హేలాపురి బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏలూరు నగరంతోపాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల్లోని 350 పాఠశాలల్లోని ప్లేస్కూల్ నుండి 10వ తరగతి వరకూ విద్యార్థులు ఈ బాలోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. 20 తరగతి గదుల్లో అకడమిక్, పది బహిరంగ వేదికల్లో కల్చరల్ అంశాలతోపాటు ఏకకాలంలో ప్రతిభా ప్రదర్శనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రెండు రోజులపాటు కరాటే, కుంగ్ ఫు, రోప్ స్కిప్పింగ్ వంటి ప్రత్యేక విన్యాసాలు విద్యార్థులతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత హేలాపురి బాలోత్సవంలో లేని జానపద నృత్యాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అకడమిక్ అంశాల్లో పద్యం భావం జూనియర్స్‌కు, మెమరీ టెస్ట్ సీనియర్స్‌కు, క్విజ్ బృందం, మట్టితో బొమ్మలు, పేపర్ క్రాఫ్ట్, కథ చెప్పడం, మైక్రో ఆర్ట్స్ పోటీలు జూనియర్స్‌కు, సీనియర్స్‌కు జరుగుతాయని పేర్కొన్నారు. కల్చరల్ విభాగంలో సందేశాత్మక గీతాలాపన (బృందం, సోలో), జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, లఘు నాటిక, వాయిద్య పరికరాలతో విన్యాసం, కోలాటం, క్లాసికల్ డ్యాన్స్ సోలో, విచిత్ర వేషధారణ (సోలో) తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. బాలోత్సవంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. 14న సిఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే బహుమతి ప్రదాన, అభినందన సభలో వెయ్యి మంది విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులు బాలోత్సవం ప్రాంగణానికి చేరుకోవడానికి నగరం నలుమూలల నుండి బస్సులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్‌ను ఈ నెల 13న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తెలిపారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, కుటుంబ వివాదాల కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, బ్యాంకు లావాదేవీలు తదితర కేసులను పరిష్కరిస్తారని, ప్రతిరోజూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజీయోగ్యమైన కేసుల్లో మధ్యవర్తిత్వం ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి కేసుల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 13,800 కేసులను రాజీయోగ్యమైనవిగా గుర్తించామని, 33 బెంచ్‌లను ఏర్పాటు చేశామని, కక్షిదారులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ జనన, మరణ ధ్రువపత్రాల జారీపై విచారణ

డిఎంహెచ్ఒ జె.అమృతం ఆదేశం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో నకిలీ జనన, మరణ ధ్రువపత్రాల జారీపై ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు స్పందించిన జనన మరణాల జిల్లా రిజిస్ట్రార్, డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం గురువారం విచారణకు ఆదేశించారు. 2017, 2018 కాలంలో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జనన, మరణాల నమోదు విభాగంలో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన తుంపాల రాజగోపాల్ అవినీతికి పాల్పడి లక్షల రూపాయలు లంచాలుగా తీసుకుని 89 నకిలీ జనన ధ్రువపత్రాలు, ఏడు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు, వాటిపై విచారణ చేయాలని కోరుతూ ఓ వ్యక్తి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆ వార్త ప్రజాశక్తి గురువారం ప్రచురించింది. దీనిపై స్పందించిన డిఎంహెచ్ఒ గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎఒ డాక్టర్ ఆర్.గంగాభవాని, కార్యాలయ స్టాటస్టికల్ ఆఫీసర్ ఎన్.ఆనంద్ కుమార్, అసిస్టెంట్ స్టాటస్టికల్ ఆఫీసర్ ఎం.కిషోర్‌బాబులతో విచారణ బృందాన్ని నియమించి, ఈ నెల 16న విచారణ చేయాలని, మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే దీనిపై డిఎంహెచ్ఒ డాక్టర్ అమృతంను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదన్నారు. అయితే 24 గంటల్లో విచారణకు ఆదేశించడం చూస్తుంటే కార్యాలయ సిబ్బంది కావాలనే ఫిర్యాదును పది రోజులపాటు అధికారి దృష్టికి తీసుకు రాలేదన్నట్లు తెలుస్తుంది. అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తుంపాల రాజగోపాల్ గతంలో నకిలీ సర్టిఫికెట్ల విషయంలో సస్పెన్షన్‌కు గురై తిరిగి పోస్టింగ్ పొందినట్లు, అంతేకాక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందటమే కాక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తూనే తిరిగి రెండోసారి జనన, మరణాల నమోదు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ పొందారు. ఈ క్రమంలోనే డిఎంహెచ్ఒ కార్యాలయంలోనూ చక్రం తిప్పి ఫిర్యాదు అధికారి దృష్టికి వెళ్లకుండా చేసినట్లు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో అధికారులు సరైన విచారణ చేసి నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని, అవినీతి జరిగినట్లు రుజువైతే నేరస్తులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



OFFICE OF THE DISTRICT REGISTRAR OF BIRTHS AND DEATHS AND THE DISTRICT MEDICAL AND HEALTH OFFICER ELURU DISTRICT, ELURU

RC.No 4387/SO/VS/CRS/2025 Date: 11.12.2025

Sub:- HM&FW Dept., - VS – Certain allegations levelled against Sri. Tumpala Rajagopal, Sub Registrar for Issuance of fake birth and Death Certificates and bribing the public at Eluru Municipal Corportaion complined by P.Sankarbabu – appointment of Enquiry officer – orders – Issued - Reg.

Ref:- Complaint against Sri. Tumpala Rajagopal made by the the P.Sankarbabu dated 01.12.2025

*****

In the reference cited, certain allegations levelled against Sri Tumpala Rajagopal working as sub registrar, Birth and Death Section, Eluru Municipal Corportaion for issuance of 89 fake birth certificates and 7 fake death certificates made by P.Sankarbabu and the complainant informed that, "he charged the Rs. 15,000 /- to 25,000 for birth certificate & Rs. /- 50,000 to 75,000 for death certificate".

The complainant informed that, Sri. Tumpala Rajagopal suspended for one year in the year 2018 as he corrected the details in the birth and death registers and issued the fake birth and death certificates but he bribed the officials, got his salary and faced no punishment.

In this connection, Dr.R. Gangabhavani, AO, O/o. DM&HO, Eluru is hereby appointed as enquiry officer along with the N.Anand Kumar, Statistical Officer & M.Kishore Babu, Assistant Statistical Officer to conduct the detailed enquiry on the allegations on Sri. Tumpala Rajagopal on 16.12.2025.

Hence, the above Enquiry Officer is directed to conduct detailed enquiry on the above matter so as to enable to take further immediate action as per procedures in this regard and submit the enquiry report within 3 days from the receipt of this communication.

Encl: Complaint along with the fake events details.

District Registrar of Births and Deaths
And
District Medical and Health Officer
Eluru District, Eluru

To
Dr.R.Gangabhavani, AO, O/o. DM&HO, Eluru
Copy to the P.Sankarbabu, Complainant

4న విశాఖలో భారీ ర్యాలీ

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

వివిధ రూపాల్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈ నెల 31 నుండి జనవరి నాలుగో తేదీ వరకూ విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో సిఐటియు మహాసభ జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ పసల సూర్యారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన రవి మాట్లాడుతూ సిఐటియు గత 55 సంవత్సరాలుగా కార్మికవర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు చేసి, అనేక విజయాలు సాధించిందన్నారు. సిఐటియు అఖిలభారత 18వ మహాసభ మొట్టమొదటిసారిగా కార్మికవర్గ కేంద్రమైన విశాఖ నగరంలో జరుగుతున్నాయన్నారు. జనవరి 4న చలో విశాఖ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.సూర్యకిరణ్, బొడ్డు రాంబాబు, ఎం.అశోక్, ఎం.బాలరాజు, పూసం దుర్గ, వంగా గోపి, ఎ.రామచంద్రం, కృష్ణ, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో...

జీలుగుమిల్లి: సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని, 12న కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ చిట్టిబొమ్మ కొండలరావు కోరారు. సమావేశంలో నాగమణి తదితరులు మాట్లాడారు.

ద్వారకాతిరుమల: సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. మహాసభ ప్రచారంలో భాగంగా ఆయన ద్వారకాతిరుమలలో పర్యటించారు. ఈ సందర్భంగా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జనవరి 4న ఆదివారం లక్షలాదిమందితో విశాఖపట్నం ఆర్‌కె బీచ్ రోడ్డులో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. జిల్లా నుండి సుమారు ఐదువేల మంది కార్మికులు, ఉద్యోగులు తరలి వెళ్తారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఆది కృష్ణ, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: ఈ నెల 27 నుండి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పంపన రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఏలూరు చుట్టుపక్కల ఉన్న రైస్‌మిల్లు కార్మికులతో కలిసి మహాసభ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గంపై కార్పొరేట్ల ఒత్తిడితో దాడి జరుగుతుందన్నారు. కార్మికవర్గ అనుకూల చట్టాలను సవరిస్తూ, లేబర్ కోడ్‌ల పేరుతో కనీస హక్కులను కాలరాసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా ఉద్యోగులు, కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ఎం.ఇస్సాక్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, శేఖర్, సిఐటియు నేతలు బైరెడ్డి లక్ష్మణరావు, జి.కోటేశ్వరరావు, ఎల్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో...

ఏలూరులో...

కొనసాగిన టెట్ పరీక్షలు

ఏలూరు అర్బన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-2025 రెండో రోజు గురువారం ఏలూరులో ప్రశాంతంగా జరిగింది. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 176 మందికి 166 మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన రెండో విడత పరీక్షకు మొత్తం 174 మందికి 161 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతి కల్పించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన గ్రేడ్-1 విఆర్‌ఒలతో భర్తీ చేయాలని కోరుతూ గురువారం ఎపి రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, డిఆర్‌ఒ విశ్వేశ్వరరావులకు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పని చేస్తున్న గ్రేడ్-1 విఆర్‌ఒలకు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు రెండు సంవత్సరాల నుండి ఇవ్వకపోవడం వల్ల గ్రేడ్-1 విఆర్‌ఒలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ప్రమోషన్ల విషయంలో ఇప్పటికే అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళామని తెలిపారు. వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. గ్రేడ్-2 విఆర్‌ఒలకు ప్రొబేషన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో సర్వే ఎగ్జామ్స్, సిపిటి పాసైనవారికి వెంటనే ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు కాయల వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం తగదు

శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బాలికల వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదని రాష్ట్ర క్రీడా సాధికారిక డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. గురువారం మండలంలోని అంకన్నగూడెంలో ఆశ్రమ గిరిజన బాలికల వసతి గృహన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం వంటలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బాలికల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి వసతిగృహంలోని సదుపాయాలతోపాటు వసతి గృహంలో వైద్య సిబ్బంది పర్యవేక్షణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ఇక్కడ పదో తరగతి చదివే బాలిక ఏడు నెలల గర్భిణిగా ఉండటం అంటే, బాలికల పట్ల సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుందని అన్నారు.


వసతి గృహంలో జగదీశ్వరి

టెట్ నుంచి రెగ్యులర్ టీచర్లను మినహాయించాలి

లోక్‌సభ సమావేశాల్లో ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి రెగ్యులర్ ఉపాధ్యాయులను మినహాయించాలని, టెట్ విషయంలో సుప్రీంకోర్టు తాజాగా వెలువరించిన తీర్పుతో ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో గురువారం ఆయన మాట్లాడారు. 15 నుంచి 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఇప్పుడు ఎంట్రీ లెవెల్ టెట్ పరీక్ష రాయమని ఒత్తిడి చేయడం వారిలో తీవ్ర ఆందోళన కల్పిస్తోందన్నారు. పరీక్షలో ఉత్తీర్ణులు కాలేకపోతే వేలాది మంది ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వచ్చి, తరగతి గదులు ఖాళీ కావచ్చని హెచ్చరించారు. విద్యాహక్కు చట్టంలో తక్షణ సవరణ తీసుకొచ్చి 2010కి ముందు విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలని ఎంపీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

13న సెలవు దినంగా ప్రకటించాలి

డిఇఒకు ఫ్యాప్టో వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 13వ తేదీ రెండో శనివారం సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ గురువారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ యాజమాన్య పాఠశాలల విద్యా క్యాలెండర్ పరిశీలనలో చాలావరకు పాఠశాలలు ఇప్పటికే 220 పని దినాలను మించి పని చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులపై ఉన్న అదనపు భారం తగ్గించేందుకు ఈ నెల రెండో శనివారం 13న పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. 220 రోజులను పూర్తి చేసిన పాఠశాలలు తమ విద్యా క్యాలెండర్ ప్రకారం ఆ రోజున పనిదినంగా కొనసాగించుకోవచ్చని, 220 పని దినాలను మించిన పాఠశాలలకు మాత్రమే ఈ సెలవును అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఎపిటిఎఫ్ బొర్రా గోపీమూర్తి, ఫ్యాప్టో ఛైర్మన్ జి.మోహన్, సెక్రెటరీ జనరల్ ఎం.ఆదినారాయణ, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఆర్.రవికుమార్, ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి జె.రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.


డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

పలు పోటీల్లో విజేతలకు అభినందన

ప్రజాశక్తి - దెందులూరు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో ఏలూరు జోన్‌లో పెదపాడు మండలంపై పెదవేగి మండలం 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. అలాగే మహిళల త్రోబాల్ ఎ భాగంలో దెందులూరు పై పెదవేగి మండలం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ప్రభాకర్, అరుణ్ కుమార్, ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రెటరీ కె.అలివేలు, ఫిజికల్ డైరెక్టర్ మొర్ల శ్రీనివాసరావు మారగాని రాజా, రఘ జమ్మ రామకృష్ణ, పరసా నాగార్జున, రమణ తదితరులు విజేతలను అభినందించారు.

క్రీడాకారులు

పక్కా ఇళ్ల నిర్మాణం కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని మారుమూల ప్రాంతంలో ఉన్న మేడేల గ్రామాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు గురువారం ఎంపిడిఒ శ్రీహరి ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు సందర్శించారు. అక్టోబర్ నెలలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ఆ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ గ్రామ ప్రజలతో మాట్లాడిన వారు పక్కా ఇళ్లు, రహదారులు నిర్మించాలని కమిషన్ సభ్యులను కోరారు. వెంటనే వీరికి పక్కా ఇళ్లు, రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలోని కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మించడానికి కావాల్సిన భూమిని, బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మించడానికి కూడా స్థల సేకరణ క్షేత్ర పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సురేందర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కృష్ణమూర్తి, సెక్షన్ ఆఫీసర్ పెదమల్లు, విద్యుత్, రెవెన్యూ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ఎన్ఆర్ఐ జూనియర్, డిగ్రీ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల సిఇఒ వి.తులసీరామ్ మాట్లాడుతూ ఈ సెమీ క్రిస్మస్ వేడుకల ద్వారా విద్యార్థుల్లో మానవ విలువలు, సౌ హర్ద భావం, సేవా స్ఫూర్తి మరింత బలపడ చాలన్నారు. విద్యతో పాటు సంస్కారాలు కూడా ఎంతో ముఖ్యమని ఎన్ఆర్ఐ విద్యాసంస్థలు నమ్ముతున్నాయన్నారు. క్రిస్మస్ గీతాలు, నాటికలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకర్షణగా నిలిచాయి. వేడుకల అనంతరం అందరికీ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.కనకరత్నం, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, వి.సురేష్, సిహెచ్.రవికుమార్, సిహెచ్‌వివి.సత్యనారాయణ, కళాశాల పరిపాలనాధికారులు కె.వరప్రసాదరావు, వి.రాట్నాలు, జె.నాగరాజు, విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎన్ఆర్ఐ యాజమాన్యం

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ విభాగం కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ విభాగం కోసం
సెల్: 83339 88814

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నూజివీడు డిఎస్‌పి ప్రసాద్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించడంతో పాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేయాలని నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. ఆగిరిపల్లి పెద్ద కొటాయి సెంటర్, జహీర్ హోటల్, హనుమంతు టీ స్టాల్ వద్ద ట్రాఫిక్ సమస్యలను ఆయన ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఆగిరిపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం వన్‌వేను పునరుద్ధరించడంతో పాటు, హరిజనవాడలో ఉన్న స్పీడ్‌బ్రేకర్స్, డ్రమ్ములను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. మెయిన్ సెంటర్‌లో ద్విచక్రవాహనాలను తమ వాహనాలను రోడ్డు మార్జిన్‌లో పెట్టాలని కోరారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం పోలీసులకు ఎస్‌ఐ పలు సూచనలు చేశారు.

కామవరపుకోట : వాహనదారులందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు అన్నారు. కామవరపుకోట చౌతాన సెంటర్‌లో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, రోడ్డు భద్రతపై వాహనదారులకు యువకులకు అవగాహన కల్పించారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామన్నారు.

ద్విచక్ర వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని దేవరగొంది పునరావాస కాలనీలో సిఐ బాల సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ గురువారం కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేర నిరోధక చర్యల్లో భాగంగా అవసరిత వ్యక్తుల సంచారం పట్ల విచారణ, పరిసరాల్లో ఉన్న నిందితుల జాడ తెలుసుకునే నిమిత్తం మోటారు బైకుల దొంగతనం నేరాలు ఇతర ఇంటి నేరాలలో పోగొట్టుకున్న వస్తువుల ఆచూకీ కనుగొనేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సౌజన్యంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టడం చాలా ఆనందదాయకంగా ఉందని టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు కుందేటి కస్తూరి అన్నారు. మండల పరిధిలోని వేల్పుచర్ల శివారు అన్నపనేనివారిగూడెంలో రూ.40.80 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు మానం ఘంటేశ్వరరావు, టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి గరికముక్కు నాని, నాయకులు మానం వంశీ, తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జల జీవన్ కుళాయిలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

జల జీవన్ మిషన్ ద్వారా అందిస్తున్న కుళాయిలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి మెండ ఝాన్సీ తెలిపారు. మండల కేంద్రమైన మండవల్లిలో జల జీవన మిషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్న కుళాయిలను ఆమె దగ్గరుండి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా కుళాయి లేని ప్రతిఇంటికీ కుళాయిలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు కుళాయి కలిగి ఉండని వారు పంచాయతీ దృష్టికి తీసుకొచ్చి కుళాయి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ గణేష్, వీరముల శివయ్య, మెండ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం మరువలేనిది

ప్రజాశక్తి - టి.నరసాపురం

పూర్వ విద్యార్థుల ఔదార్యం మరువలేనిదని టి.రసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎల్‌స్వామి తెలిపారు. స్థానిక పాఠశాలలో 2002-03 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన విరాజిత పురస్కారం నగదును అదే హైస్కూలు ప్లస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మన్యం కావ్యాంజలికి గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని కావ్యాంజలికి నగదు పురస్కారం అందించడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమన్నారు. పూర్వ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నానిపల్లి ఏసుబాబు, కామన వెంకటేశ్వరరావు, పూరేటి కృష్ణ, మాదంశెట్టి సురేష్, పుట్టాల రామకృష్ణ, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

ముదినేపల్లి : ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం ఎంపిపి సత్యనారాయణ అధ్యక్షతన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. మందులు, ఇతర సామగ్రి అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది చూడాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిని సందర్శించి హాస్పిటల్‌లో స్లాబ్ లీక్‌లను పరిశీలించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపిస్తామన్నారు. వైద్య సిబ్బంది సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై.రామకృష్ణ, పిహెచ్‌సి వైద్య అధికారిణి శాంతిశ్రీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో 'మార్పు'

జంగారెడ్డిగూడెం :పోలవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ల సమన్వయంతో 'నవోదయం 2.0'లో భాగంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత మాట్లాడుతూ నాటుసారాయి వృత్తిని పూర్తిగా విడిచిపెట్టి చట్టబద్ధ జీవన విధానాన్ని ఆచరిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం మార్పు కార్యక్రమం గొప్ప పునరావాస అవకాశాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిఎన్.ప్రభు కుమార్, బి.ఆవులయ్య, జి.పాండురంగారావు, భానుమతి, రామారావు, ఝాన్సీ, జేమ్స్, పద్మావతి, బిఆర్.శ్రీనివాసులు, గౌరీ వరలక్ష్మి, అగ్రికల్చర్, హార్టికల్చర్ శాఖాధికారులు కె.శ్రీనుబాబు, కె.వీరబ్రహ్మం, షేక్ రమేష్ పాల్గొన్నారు.

ఆక్వా రైతుల జిల్లా సదస్సు 19కి వాయిదా

ప్రజాశక్తి - కలిదిండి

ఈ నెల 13న కలిదిండిలో జరగాల్సిన ట్రంప్ సుంకాలు సంక్షోభంలో ఆక్వా రంగం పరిష్కార మార్గాలపై ఆక్వా రైతుల జిల్లా సదస్సును ఈ నెల 19వ తేదీన స్థానిక కళ్యాణి ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు సిపిఎం కలిదిండి, ముదినేపల్లి మండలాల ప్రాంతీయ కమిటీ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన జరిగే జిల్లా స్థాయి ఆక్వా రైతుల సదస్సుకు ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. ఆక్వా రైతాంగ సమస్యలపై తీర్మానాలు చేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆక్వా రైతులు, ఆక్వా అనుబంధ పరిశ్రమల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు పతివాడ పెద్దిరాజు, బొడ్డేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

అధికారులు హాజరు కాని సమావేశాలెందుకు?

ఏలూరు సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి కీలక శాఖల అధికారులు హాజరు కాకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీసింది. వైద్య ఆరోగ్యశాఖ, పశు వైద్యశాఖ, ఆర్‌టిసి, స్త్రీ శిశు సంక్షేమం తదితర ముఖ్య శాఖల అధికారులు సమావేశానికి దూరంగా ఉండటం ప్రజాప్రతినిధుల్లో అసహనాన్ని పెంచింది. మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు హాజరు కాకపోవడం వల్ల, ఇలాంటి పరిస్థితుల్లో సమావేశం నిర్వహించినా నిర్వహించకపోయినా తేడా లేదని పలువురు ప్రజాప్రతినిధులు వ్యాఖ్యానించారు. ఈ సమావేశానికి హాజరైన అధికారులు తమ శాఖల పరిధిలో గత మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, పురోగతి పనుల వివరాలను సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపిపి పెన్మెత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన ప్రతి అంశంలో అధికారులు సమన్వయంతో ముందుకు రావాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ నాగరాజకుమారి, వడ్డీ కార్పొరేషన్ ఛైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ అసహనం

మండల సర్వసభ్య సమావేశంలో ఏర్పడిన అవ్యవస్థపై జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిడిఒ ఆహ్వానం మేరకు తాను సమావేశానికి హాజరు కావడానికి ముందుగానే సంప్రదించినప్పటికీ, సమావేశ సమయంపై సరైన సమాచారం ఇవ్వకపోవడం ఆమె ఆవేదనకు కారణమైంది. మండల సర్వసభ్య సమావేశానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌ను ఎంపిడిఒ అధికారికంగా ఆహ్వానించారు. ఆహ్వానం మేరకు ఆమె ఎంపిడిఒను సంప్రదించగా సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, ప్రారంభానికి ముందు తిరిగి తెలియజేస్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చినట్లు తెలిపారు. నిర్ణీత సమయానికి ఎటువంటి సమాచారం ఇవ్వకపోగా ఛైర్‌పర్సన్ తరపున సీసీ ఫోన్ ద్వారా చేసిన కాల్స్‌కు కూడా ఎంపిడిఒ స్పందించలేదని ఘంటా పద్మశ్రీ ఆక్షేపించారు. తరువాత సమావేశ స్థలానికి వెళ్లగా అప్పటికే సమావేశం ముగిసిపోయి, అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారని ఉద్యోగులు వెల్లడించారు. ప్రజా సమస్యలు చర్చించడానికి ఏర్పాటు చేసిన సమావేశాన్ని కనీసం గంటసేపు కూడా నిర్వహించకపోవడం అత్యంత బాధాకరమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ విమర్శించారు. ఎంపిడిఒ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో తనను సంప్రదించాలని స్థానిక ఉద్యోగులకు సూచించారు. మండల స్థాయి సమావేశాల్లో ఇలాంటి నిర్లక్ష్య ధోరణి బాధ్యతాయుతమైన పాలనకు అనుకూలం కాదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

జాబ్‌మేళాలో 191 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చిందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎపి స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం వద్ద జాబ్‌మేళా నిర్వహించారు. 14 కంపెనీల్లో 1110 ఉద్యోగాలు ఉండగా వాటి కోసం నిర్వహించిన జాబ్‌మేళాకు 292 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఉద్యోగాల హామీని అమలు చేస్తూ యువతకు ఆశాకిరణంగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందన్నారు. జాబ్‌మేళాల నియామక ప్రక్రియలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఇలాంటి అవకాశాలను ప్రతి నిరుద్యోగ యువత పూర్తిగా వినియోగించుకుని, తమ భవిష్యత్తును సుసంపన్నం చేసుకోవాలని చెప్పారు. ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా విస్తృతంగా ప్రయివేట్ ఉపాధి అవకాశాలను సృష్టించనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో యువతకు మరింత ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి - మండవల్లి

యుటిఎఫ్ అందిస్తున్న మోడల్ టెస్ట్ పేపర్లను సద్వినియోగం చేసుకుంటే పది పరీక్షల్లో మరింత రాణించేందుకు దోహదపడతాయని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరిగిరి పిచ్చోడు స్పష్టం చేశారు. మండలంలోని కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయురాలు కె.ధనలక్ష్మి ఆర్థిక సహాయంతో యుటిఎఫ్ శాఖ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్లను గురువారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదివిన పాఠ్యాంశాలతో పాటు మోడల్ టెస్ట్ పేపర్లు కూడా ఎంతో అవసరమన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఈ మోడల్ టెస్ట్ పేపర్లను తయారు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జనరల్ సెక్రటరీ కె.ఆనంద్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా శ్రీనివాసరావు, సనావుల్లా, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ నూజివీడు తాలూకా యూనిట్ ఉపాధ్యక్షులుగా ఈదర గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ నిషాకాలి ఎంపిక కాగా సభ్యులుగా నూగొండపల్లి, వడ్లమాను గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎస్.ఇందిర, కె.సునంద, సూరవరం డిజిటల్ అసిస్టెంట్ ఉమ, వడ్లమాను ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి ఎన్‌జిఒస్ ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది వారిని అభినందించారు.

ఎన్నికైనా నూతన కార్యవర్గం

ఉచిత ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండలం కోమర్రు గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఆర్‌ఒ ప్లాంట్‌ను నిర్మించామని గ్రామ సర్పంచి కూనపురెడ్డి శ్రీసాయికృష్ణ తెలిపారు. కోమర్రులో ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. గ్రామంలో 800 మంది పైగా ఉన్న జనాభాకు స్వచ్ఛమైన తాగు నీరందక ఇక్కట్లు పడుతున్నారన్నారన్నారు. గ్రామంలో ఆక్వా చెరువులు విస్తరించడంతో తాగునీరు కలుషితమై స్వచ్ఛమైన నీరు దొరకని పరిస్థితి గ్రామస్తులకు ఏర్పడిందన్నారు. ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న వడాలి, గోకినంపాడు, శ్రీహరిపురం గ్రామాలకు కోమర్రు గ్రామ ప్రజలు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారన్నారు. పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు స్వచ్ఛమైన నీరు గ్రామస్తులకు అందించాలని, గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ పలు సార్లు కోరడంతో గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం పంచాయతీ నిధులు రూ.6.50 లక్షలతో ఆర్‌ఒ ప్లాంటును నిర్మించామన్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలో ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలకు ఉచితంగా ఆర్‌ఒ నీటిని అందిస్తామ న్నారు. గ్రామస్తులకు కూలింగ్ వాటర్ కూడా అందించే దుకు చర్యలు తీసుకోనున్నట్లు సర్పంచి కె.శ్రీసాయికృష్ణ తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం సిఎస్‌టిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన, ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో షీ టీమ్‌తో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎస్ఐ వీరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. షీ టీమ్ నుంచి రత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, కళాశాల ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ సిహెచ్.రమాదేవి, కళాశాల లీగల్ క్లబ్ కన్వీనర్ టివి.రాంబాబు, అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ సిహెచ్.బద్రినారాయణ, గాళ్ల శ్రీనివాసరావు, పి.సన్యాసరావు, వి.హనుమంతరావు, ఆర్.విజయ దీపిక, కెవివి.శిరీషా, సిహెచ్.షాలిని పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ : ఎస్ఐ

జీలుగుమిల్లి : అత్యవసర పరిస్థితుల్లో మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను ప్రతి మహిళ వినియోగించేలా అవగాహన కల్పించాలని ఎస్ఐ వి.క్రాంతికుమార్ మహిళా పోలీసు(జిఎంఎస్‌కె)లను ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళ శక్తి యాప్‌ను వినియోగించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆయా సచివాలయాల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్ఐ క్రాంతికుమార్ ఆదేశించారు. మండలంలో ఉన్న పలువురు రౌడీషీటర్లకు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు.

అంగన్‌వాడీలకు 5జి స్మార్ట్ ఫోన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి సత్వర సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం 5జి స్మార్టు ఫోన్లు అందించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో భీమడోలు ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీలకు ఫోన్లు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ సునీల్, రాజ్‌శేఖర్, సెక్టార్ సూపర్‌వైజర్లు, సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.

ఖాళీ షాపులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు వన్‌టౌన్ చేపల మార్కెట్ ప్రాంతంలో నగరపాలక సంస్థ 2018-19లో నిర్మించిన షాపులు నిరుపయోగంగా ఉన్నట్లు తెలుసుకున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి గురువారం అక్కడి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. 14 షాపుల్లో మాత్రమే వ్యాపారాలు నడుస్తుండగా, మిగిలినవి ఖాళీగా ఉండటంపై ఎంఎల్‌ఎ ఆందోళన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న షాపులు కూడా వ్యాపారులే మరమ్మతులు చేయించుకుని ప్రారంభిస్తే, ఆ ఖర్చును అద్దెలో సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ గడువులోగా వారు వ్యాపారాలు ప్రారంభించకపోతే, ఆ షాపులను వేరే వారికి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. కాంప్లెక్స్ వెలుపల రోడ్డుపైన వ్యాపారాలు చేయడం వల్ల నడకదారి ఇబ్బంది పెరుగుతోందని, అందరూ తమకు కేటాయించిన షాపుల్లోకే మారాలని ఎంఎల్‌ఎ సూచించారు. అవసరమైన చోట రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఎంఎల్‌ఎ చింతమనేనిని కలిసిన ఎస్ఐ

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామాలన్నీ ఎంతో ప్రశాంతంగా ఐకమత్యంగా ఉంటున్నాయని, అటువంటి వాటిని తిరిగి మరోసారి అలజడులు సృష్టించి, గ్రామాల్లో ప్రశాంతత దెబ్బతీయాలని ఎవరు ప్రయత్నించినా, అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలు అక్రమాలకు ఎవరు పాల్పడినా కూడా వారిని ఉపేక్షించకుండా చర్యలు తీసుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పోలీస్ అధికారులకు సూచించారు. ఇటీవల పెదవేగి పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మడాల హరిగోపాల్ దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు అండగా సిఎంఆర్‌ఎఫ్

ప్రజాశక్తి - పెదవేగి

ఎన్‌టిఆర్ వైద్య సేవ, సిఎం సహాయనిధి ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలందించి అండగా నిలుస్తున్నామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పెదవేగి మండలం భోగాపురం గ్రామానికి చెందిన మహిళ మందలపు వరలక్ష్మికి వైద్య చికిత్స నిమిత్తం ఎంఎల్‌ఎ చొరవతో మంజూరైన రూ.ఆరు లక్షల ఎల్‌ఒసిని ఆమె కుటుంబ సభ్యులకు గురువారం అందించారు. బాధితురాలికి మెరుగైన చికిత్స అందించి త్వరితగతిన కోలుకునేలా చూడాలని సంబంధిత ఆసుపత్రి వైద్యులకు సూచించారు. అన్నివిధాలా అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి ఆపదలో అండగా నిలిచిన దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

31 మందికి రూ.13.69 లక్షలు మంజూరు

భీమడోలు :ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సిఫార్సు మేరకు ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని 31 మందికి వైద్య సేవల కోసం రూ.13.69 లక్షలు మంజూరయ్యాయని భీమడోలులోని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. దీనిలో భాగంగా భీమడోలు మండలానికి చెందిన 12 మంది, గణపవరం మండలానికి చెందిన ఏడుగురు, నిడమర్రు మండలం కేంద్రానికి చెందిన నలుగురు, ఉంగుటూరు మండలానికి చెందిన ఎనిమిది మందికి లబ్ధి చేకూరిందన్నారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని టిడిపికి చెందిన నాలుగు మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఇతర ప్రముఖుల సమక్షంలో వాటిని లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రముఖులు ఉండవల్లి బాలానందం, కరణం పెద్దిరాజు, యుగంధర్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వేలేరుపాడు రూరల్ :మండలంలోని తాట్కూరుగొమ్ము గ్రామపంచాయతీకి చెందిన కోడూరి నరసింహారావు అనారోగ్య రీత్యా హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం పిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. బాధితునికి రూ.67,611 చెక్కును ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయం నుంచి వేలేరుపాడు జనసేన మండలాధ్యక్షులు గణేశుల ఆదినారాయణకు పంపించారు. కోడూరి నరసింహారావుకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదినారాయణ గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి కొవ్వల క్రాంతికుమార్, జనసేన నాయకులు దేవిరెడ్డి సుధాకర్, ములిశెట్టి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) గుడివాడ వారి కోర్టులో
ఓఎస్.నెం.124/2024
బిట్వీన్:
బైరెడ్డి వెంకట నారాయణ రెడ్డి ....వాది
మరియు
1. వరిగంజి ఏసుదీవెన రత్నకుమారి
2. మొవ్వ కల్పన, భర్త : మర్రి సురేష్ కుమార్, వయస్సు 36 సం॥లు, పెట్రోలు బంకు వీధి, పీర్లబజారు, నూజివీడు, ఏలూరుజిల్లా. ... ప్రతివాదులు
పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మొవ్వ కల్పనకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకోనందున పేపరు ప్రకటన ద్వారా దావా సమనులు అమలు జరుపుటకు కోర్టువారు ఉత్తర్వులు యిచ్చియున్నందున యిందుమూలముగా తెలియజేయటమైనది. కావున ది.09-01-2026వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీరు స్వయంగా గానీ, మీ తరపున న్యాయవాది గాని ఆక్షేపణలు వున్న యెడల తెలుపవలెను. లేని పక్షమున పరోక్షమున తీర్మానము చేయబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 09-01-2026.
ఇట్లు
డి. వీరయ్య, బి.ఎ., ఎల్‌ఎల్.బి.,
అడ్వకేట్, గుడివాడ.
సెల్ నెం.9989809390